తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక





హైదరాబాద్ శుక్రవారం 27 - 02 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 6


### మరిది వదిన గొంతు కోసిన కేసులో..

# ఖాకీ నిర్లక్ష్యంపై ప్రజాగ్రహం

## నేషనల్ హైవేపై గ్రామస్తులు, కుటుంబ సభ్యుల రాస్తారోకో



- నిందితులను, సహకరించినోళ్లను అరెస్టు చేయకపోవడం పట్ల ఆగ్రహం
- పోలీసులు రూ.10 లక్షలు తీసుకుని నిందితుల కొమ్ము కాస్తున్నారని ఆరోపణ
- సీఐ, పోలీసులతో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వాగ్వివాదం
- సుమారు రెండు గంటల పాటు బైఠాయించి ఆందోళన

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో భూతగాదాలో మరిది వదిన గొంతు కోసి హత్యాయత్నం చేసిన కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేయడం లేదని, పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు గురువారం వలిగొండ-తొర్రూర్ 930పి జాతీయ రహదారిపై రాస్తారోకోకు దిగారు. వదిన లక్ష్మీ గొంతు కోసిన మరిది బొంత అశోక్‌తో పాటు మేనల్లుళ్లను, వారికి సహకరించిన పెద్ద మనుషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. లక్ష్మీని చంపడానికి మరిది, మేనల్లుళ్లు దాడి చేసి గొంతు కోసిన రోజు పోలీసులకు సమాచారం ఇచ్చినా గంట తర్వాత ఎందుకు ఆలస్యంగా వచ్చారని, నిందితులకు పోలీసులు, పెద్ద మనుషులు మొదటి నుంచి సహకరిస్తున్నారని ఆరోపించారు. మరిది అశోక్ తన భూమిని అమ్ముకుని అన్న భూమిపై కన్నేశాడని, తమ్ముడు, తోబుట్టువులు, మేనళ్ల వేధింపులతోనే అన్న నర్సింహ చనిపోయాడని, నర్సింహ మరణం తర్వాత వదిన లక్ష్మీపై అశోక్, ఆడపడుచులు, మేనళ్లు వేధింపులకు గురి చేశారని, దాడులకు పాల్పడ్డారని తెలిపారు. అశోక్ దాడులు, వేధింపులపై ఐదారు సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోలేదని, పోలీసులు రూ.10 లక్షలు తీసుకుని నిందితులకు కొమ్ము కాయడంతోనే లక్ష్మీపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. నేషనల్ హైవేపై రాస్తారోకో విషయం తెలుసుకున్న మోత్కూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సతీష్ కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లగా గ్రామస్తులు, బంధువులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. లక్ష్మీ పిల్లలు మాట్లాడుతూ మా బాబాయ్, అత్తమ్మలు, బావలు కలిసి మా అమ్మను..


2లో..

# గ్రామస్తులు, కుటుంబ సభ్యుల రాస్తారోకో





**మొదటి పేజీ తరువాయి..**
చంపేందుకు గొంతు కోశారని, మా నాన్న కూడా వారి కారణంగా చనిపోయాడని, పోలీసులు మాకు ఎందుకు న్యాయం చేయడం లేదని, మా అమ్మ ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోలేదని, మీ నిర్లక్ష్యంతోనే మా అమ్మపై దాడి జరిగిందని పోలీసులను నిలదీశారు. భర్తను కోల్పోయి ముగ్గురు చిన్న పిల్లలతో ఒంటరిగా జీవిస్తున్న నిస్సాహాయ మహిళపై ఇంత పెద్ద కుట్ర చేసి హతమార్చాలని చూశారని, మానవత్వం లేకుండా పెద్ద మనుషులు, పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద మనుషులు, ఓ రాజకీయ నాయకుని అండదండలతోనే పోలీసులు నిందితుల కొమ్ము కాస్తూ కేసును నీరుగార్చుతున్నారని, దాడికి పాల్పడిన వారిని, సహకరించిన వారిని నేటికీ ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ కేసులో 12 మందికి పైగా హస్తం ఉందని, నిందితులు అశోక్, మేనళ్లుల్లు ముగ్గురిని, వారికి సహకరించిన వారందరినీ వెంటనే అరెస్టు చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అశోక్ గతంలోనే లక్ష్మీపై దాడి చేసిన సమయంలోనే పోలీసులు కఠిన చర్యలు తీసుకుని రక్షణ కల్పించి ఉంటే ఈ దారుణం జరిగి ఉండేది కాదన్నారు. నిందితులతో పాటు సహకరించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన విరమించేది లేదని రోడ్డుపై భీష్మించి కూర్చున్నారు. సుమారు రెండు గంటలు రాస్తారోకోతో హైవేపై వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. సీఐ వెంకటేశ్వర్లు గ్రామ సర్పంచ్ అంతటి భగవంతుతో మాట్లాడి నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షిస్తామని, బాధితురాలికి తగిన న్యాయం చేస్తామని, పెద్ద మనుషుల పాత్ర ఉంటే వారిపై పీడీ యాక్ట్ కేసులు పెడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి హత్యాయత్నం చేసిన నిందితులతో పాటు సహకరించిన వారిని శిక్షించాలని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.